www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 14 డిసెంబర్ 2025

5

తిరుపతి

హస్తకళలకు మహర్దశ : మంత్రి సవిత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ప్రాచీన హస్త కళలు అంతరించిపోకుండా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందనీ, వాటికి మహర్దశను తీసుకొచ్చేందుకు అవిశ్రామంగా శ్రమిస్తోందని బీసీ వెల్ఫేర్, జౌళీ, వస్త్ర పరిశ్రమ శాఖ మంత్రి సవిత అన్నారు. శ్రీకాళహస్తిలో శనివారం ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, లేపాక్షి సంయుక్తంగా చేనేత, కొయ్యబొమ్మల తయారీ కళాకారులకు టూల్ కిట్లను పంపిణీ చేశారు. చరిత్ర సాక్ష్యాలుగా నిలిచే ఇతిహాసాలను తోలుబొమ్మల రూపంలో రూపొందించి రాష్ట్రపతి అవార్డులు అందుకున్న కళాకారులు శివమ్మ, అంజనప్ప, హరినాథ్, విజయలక్ష్మి లను సత్కరించారు.ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి అంటే గుర్తొచ్చేది మహాశివుడు, ఆ తర్వాత కలంకారి అన్నారు. ఆ కలంకారికి తాను బ్రాండ్ అంబాసిడర్ గా ఉంటూ మరింత ఖ్యాతి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం వందమంది చేనేత, కొయ్యబొమ్మల కళాకారులకు రూ. 10 వేలు విలువజేసే టూల్ కిట్లను పంపిణీ చేశారు. హస్త కళల కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, భారత్ బయోటిక్ వ్యవస్థాపకురాలు ఎల్లా సుచిత్ర పాల్గొన్నారు.

విద్యార్థి లేనిదే..ఏ ఉద్యమమూ లేదు..!

- స్వాతంత్ర్యోద్యమంలోనూ వారిదే కీలకపాత్ర
- ఉన్నత విద్యలో సమూల మార్పుకు నడుం బిగించాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల్లో సంఘీభావ వక్తలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'విద్యార్థి లేనిదే ఏ ఉద్యమం లేదని చరిత్ర చెబుతోంది..నాడు స్వాత్రంత్యోద్యమంలోనూ విద్యార్థులకు కీలక భూమిక పోషించారు.. నేడు కాషాయీకరణ, వ్యాపారీకరణ, కేంద్రీకరణతో కూడిన నూతన విద్యను సమూలంగా మార్చాలంటూ బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించాలి' అని వక్తలు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో శనివారం రెండో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా ఈ మహాసభలకు సంఘీభావం తెలుపుతూ రాష్ట్రసంఘాల ప్రతినిధులు ప్రసంగించారు.

కెఎస్.లక్ష్మణరావు

పిడిఎఫ్ మాజీ ఎంఎల్సి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ 'నేను ఎస్ఎఫ్ఐ నుంచే నాయకత్వ లక్షణాలను అలవరచుకున్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన విద్యార్థి ఎన్నికల్లో పోటీచేసి జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యాను. తరువాత 25 ఏళ్లపాటు లెక్చరర్గా పనిచేశాను. 14 ఏళ్లపాటు పిడిఎఫ్ ఎంఎల్సిగా ఉన్నాను. ఇంత స్థాయికి రావడానికి కారణం ఎస్ఎఫ్ఐ క్రమశిక్షణ, ఉద్యమం నేర్పిన పాఠాలు. సమాజంలో పేదల కోసం విద్యార్థులు పని చేయాల్సిన అవసరం ఉంది. ఉన్నత విద్యను వ్యాపారమయంగా మార్చేశారు. ఇంజినీరింగ్ విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ అధ్యయనం చేసి పోరాటాల రూపకల్పన చేయాల్సిన అవసరం ఉంది. వారికోసం వర్క్షాపులు, శిక్షణా తరగతులు, టెక్నాలజీతో కూడిన శిక్షణ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేయాలి. ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో 77 రద్దు చేస్తామని ప్రకటించిన మంత్రి నారా లోకేష్ విస్మరించారన్నారు. జగన్ హయాంలో ఆరు పాఠశాలలను చేస్తే, నారా లోకేష్ ఆధ్వర్యంలో తొమ్మిది రకాల పాఠశాలలుగా విభజించి 25వేల స్కూళ్లు మూతబడేలా చేశారన్నారు. రాష్ట్రంలో 66 లక్షల మంది ప్రజలు చదువుతుంటే 34లక్షల మంది పిల్లలు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో చదువుతున్నారన్నారు.

నక్కా వెంకటేశ్వర్లు

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఊరికి వెళ్లేటప్పుడు ఇంటికి ఏ విధంగా తాళం వేసుకుని వెళతామో స్కూలుకు వెళ్లే విద్యార్థులు కులం, మతాలన్నింటినీ ఇంటి గడప లోపలే వదిలేసి వెళ్లాలన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రతి ఒక్కరికీ చదువు అనేది నేటి పాలకులు విస్మరిస్తున్నారన్నారు. నాణ్యమైన, ఉన్నత విద్య అభివృద్ధికి ఎస్ఎఫ్ఐ చేసే పోరాటంలో యుటిఎఫ్ క్రియాశీలకంగా భాగస్వామ్యం అవుతుందన్నారు.

వి.వెంకటేశ్వర్లు

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమం లేనిదే ఏ ఉద్యమమూ లేదన్నారు. సామ్రాజ్యవాద అమెరికాలో కీలకనగరమైన న్యూయార్క్లో సోషలిస్ట్ పవనాలు వీస్తున్నాయన్నారు. సామ్రాజ్యవాదం బీటలు వారుతుందనడానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో 40శాతం మంది వ్యవసాయ కూలీల పిల్లలేనని అన్నారు. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాల్లో చదివించడమే ఎక్కువైతే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న నూతన విద్యా విధానం వల్ల డ్రాపౌట్స్ పెరిగే ప్రమాదం ఉందన్నారు.

కందారపు మురళి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థి, కార్మిక సంఘాలు కలిసి పని చేయాల్సిన అవసరం ఉంది. విద్యను వ్యాపారీకరణ చేసేశారు. ఎన్నో త్యాగాల ఫలితంగా సాధించుకున్న స్వాతంత్ర్య ఫలాలను అదానీ, అంబానీలకు ప్రధాని మోడీ దోచి పెడుతున్నారన్నారు. దేశంలో లేబర్కోడ్లను తెచ్చి కార్మిక శక్తిని బలహీనపరిచేందుకు మోడీ సర్కార్ కుట్ర పన్నుతుందన్నారు. దేశం క్లిష్టపరిస్థితులు ఉన్న నేపథ్యంలో బలమైన ఉద్యమం జరగాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు మోడీ కనుసన్నల్లో పాలన చేస్తున్నారు తప్ప స్వయం పాలన లేదన్నారు. కేరళలో కేంద్రం సహాయ సహకారాలు లేకపోయినప్పటికీ పేదరికాన్ని జయించిందన్నారు. సామ్రాజ్యవాదానికి సవాల్ విసురుతూ చైనా, క్యూబాలు ధీటైన ప్రత్యామ్నాయాలతో ముందుకు పోతున్నాయన్నారు.

శ్రేష్ట, పాండిచ్చేరి

పాండిచ్చేరి యూనివర్సిటీలో ఇటీవల ఎన్నికైన యూనియన్ ఉపాధ్యక్షురాలు శ్రేష్ట ఎస్ఎఫ్ఐ ఉద్యమ ఫలితాలను వివరించారు. అఖిలభారత అధ్యక్షులు ఆదర్శ్ ఎం.సాజి, కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, భగత్రవి పాల్గొన్నారు.

ఉద్యమ వీరుడు కామ్రేడ్ పెంచలయ్యకు ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభ ప్రతినిధుల 'లాల్సలాం'

పెంచలయ్య అమర్రహే..!

ఉద్యమాల్లో బతికే ఉన్నాడు : సతీమణి దుర్గ


శ్రీసిటీ ఆధ్వర్యంలో చిరుసత్కారం

సమాజానికి తిరిగివ్వడం మానవ ధర్మం

శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి సభలో 'టాక్ షో' ప్రయోక్త కిరణ్ప్రభ

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగా ఆరోగ్యకరమైన, ఆనందదాయక జీవనం సాగిస్తున్న మనం సమాజానికి కొంత తిరిగివ్వడం మానవ ధర్మం అని ప్రఖ్యాత 'టాక్ షో' ప్రయోక్త, సాహితీ వేత్త కిరణ్ప్రభ వ్యాఖ్యానించారు. శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం శ్రీసిటీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన తన సతీమణి కాంతికిరణ్ తో కలసి పాల్గొన్నారు.

కార్యక్రమంలో "జీవన సాఫల్యం-సమాజానికి తిరిగివ్వడం" అనే అంశంపై కిరణ్ ప్రభ మాట్లాడారు. ఇందులో భాగంగా కారల్మార్క్స్, గిడుగు రామమూర్తి, దుర్గాబాయి దేశ్ ముఖ్, యల్లాప్రగడ సుబ్బారావు, జార్జి ఈస్టమన్, చెగువేరా వంటి మహా వ్యక్తుల జీవిత గాథలు, వారు చేసిన సమాజ సేవ, త్యాగాలు, గుప్త దానాలు గురించి కళ్లకు కట్టినట్టు వివరిస్తూ స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. ఇలాంటి త్యాగధనులను గుర్తు చేసుకుంటూ అందరం సమాజానికి కొంత తిరిగివ్వాలన్నారు. ఇవ్వడంలో ఎంతో తృప్తి ఉందని, అలా ఇస్తూ దానిని వ్యసనంగా మార్చుకోవాలని సూచించారు. ఇలా వందలాది ప్రముఖ వ్యక్తుల జీవిత చరిత్రలను యువ తరాలకు స్ఫూర్తినిచ్చేలా వారి ఆదర్శవంతమైన జీవిత విశేషాలను 'టాక్ షో' ల ద్వారా తాను ప్రధానంగా వివరిస్తున్నట్లు చెప్పారు. అందరూ తన యూట్యూబ్ ఛానల్ ద్వారా దీనిని వినవచ్చని తెలిపారు. ప్రపంచవ్యాప్త ప్రేక్షకులతో ముడిపడిన టాక్ షో ల వెనుక విస్తృతమైన పరిశోధన, సాధన, ఒక్కో ఎపిసోడ్ కు 25 గంటల శ్రమ దాగి ఉందన్నారు. సాహిత్యం, సినిమా, సామాజిక సమస్యల వంటి అంశాలపై తన ప్రదర్శనలు ఉంటాయన్నారు. కిరణ్ప్రభ ఇప్పటివరకు దాదాపు 800 మంది ప్రముఖ వ్యక్తుల జీవితాలను వివరిస్తూ 1800 రేడియో టాక్ షోలను నిర్వహించారు. ఖచ్చితమైన పరిశోధన, అంతర్దృష్టి కథనాలకు ఆయన ప్రసిద్ధి చెందాడు. స్ఫూర్తిదాయక ప్రసంగం చేసిన కిరణ్ప్రభను శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఎల్సి భూమిరెడ్డి రాంగోపాల్రెడ్డి చేతుల మీదుగా కిరణ్ప్రభ దంపతులను సత్కరించారు. కార్యక్రమం అనంతరం, శ్రీసిటీ సమీపంలోని ఇరుగుళం జిల్లా పరిషత్ హైస్కూల్ సందర్శించిన కిరణ్ ప్రభ, అక్కడ విద్యార్థులను ఉద్దేశించి క్రమశిక్షణ, దేశభక్తి, విద్యలో ఎలా రాణించాలి, చెడు అలవాట్లకు దూరంగా ఎలా ఉండాలి వంటి పలు అంశాలపై ప్రత్యేక ప్రసంగం చేశారు. శ్రీసిటీ పీఆర్వో పల్లేటి బాలాజీ కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు. హైదరాబాద్, తిరుపతి, చెన్నై, సూళ్లూరుపేటకు చెందిన సాహితీప్రియులు, పరిశ్రమల ఉద్యోగులు హాజరై, కిరణ్ప్రభ బహుముఖ ప్రజ్ఞను మెచ్చుకుని కార్యక్రమాన్ని ఆస్వాదించారు. ప్రేక్షకులు అడిగిన పలు సందేహాలను కిరణ్ ప్రభ నివృత్తి చేశారు.

29-31 తేదీల్లో ఇన్నోవేషన్స్పై ప్రీమియర్ గ్లోబల్ కాన్ఫరెన్స్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

కేఎల్ఈఎఫ్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ, సస్టైనబుల్ ఫ్యూచర్ ఎనర్జీ డివైసెస్ కోసం ఉద్భవిస్తున్న థర్మోనానో ఏఐ పై అంతర్జాతీయ సదస్సు ను నిర్వహించడానికి సిద్ధమైంది. కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఛాన్సలర్ ఎర్. కోనేరు సత్యనారాయణ తెలిపారు.2025, డిసెంబర్ 29 నుండి 31 వరకు జరగనున్న ఈ కాన్ఫరెన్స్, థర్మల్ సైన్సెస్, నానోటెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సస్టైనబుల్ ఎనర్జీ రంగాల్లో అగ్రగామి నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువస్తోంది. భవిష్యత్తులో సుజ్ఞాన పర్యావరణ హిత ఎనర్జీ టెక్నాలజీలను ముందుకు నడిపే వినూత్న ఆలోచనల మార్పిడికి ఈ వేదిక కీలక ప్లాట్ఫామ్గా నిలవనుంది. మద్రాస్ ఐఐటి, ఖతార్ యూనివర్సిటీ, కర్నూలు, ఢాకా, హైదరాబాద్, ఇతర ప్రముఖ సంస్థల నిపుణులు పాల్గొననున్నారు.

రంగినేని చెంచయ్య అంకితభావం అభినందనీయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రంగినేని చెంచయ్యానాయుడు అంకితభావం అభినందనీయమని పలువురు ప్రముఖులు కొనియాడారు. శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం శనివారం యార్డు ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళిమోహన్, తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షులు నరసింహయాదవ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ తో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గం అంటే గుర్తొచ్చేది బొజ్జల కుటుంబం అన్నారు. బొజ్జల కుటుంబాన్ని నమ్ముకున్నవారికి ఎవరికీ అన్యాయం జరగదన్నారు. ఇందుకు నిలువెత్తు సాక్ష్యం రంగినేని చెంచయ్యానాయుడు అన్నారు. రంగినేని చెంచయ్య నాయుడు కుటుంబం మొదటి నుంచి బొజ్జల కుటుంబాన్నే నమ్ముకుని ఉందన్నారు. అందుకే చెంచయ్యానాయుడుకు మూడు పర్యాయాలు మార్కెట్ యార్డు ఛైర్మన్ గా అవకాశం కల్పించారన్నారు. రంగినేని చెంచయ్య సౌమ్యుడు, నిజాయతీ పరుడు అని కొనియాడారు. అందుకే చెంచయ్యకు బొజ్జల కుటుంబం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎన్ని సమస్యలు ఎదురైనా రంగినేని చెంచయ్య నాయుడు టీడీపీని వీడలేదన్నారు. వైసీపీ హయాంలో చెంచయ్యపై అనేక అక్రమ కేసులు పెట్టి హింసించారన్నారు. అయినా మొక్కవోని ధైర్యంతో ముందుకు వెళ్లారని కొనియాడారు. రంగినేని చెంచయ్యకు రైతుల సమస్యలపై పూర్తి అవగాహన ఉందనీ, వారి సంక్షేమం కోసం పని చేస్తారని వక్తలు అభిప్రాయ పడ్డారు. మార్కెట్ యార్డును అభివృద్ధి పథంలో నడిపిస్తారన్నారు. ఇక ఎన్డీయే కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాత ప్రభుత్వంగా నిలుస్తూ రైతుల అభివృద్ధిలో అండదండగా నిలుస్తుందన్నారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా చెంచయ్య నాయుడు, ఉపాధ్యక్షుడిగా గంగిరెడ్డి, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారానికి ముందు పట్టణంలోభారీ ఎత్తున ఊరేగింపు జరిగింది.



రంగినేనికి ఎంజీఎం సత్కారం

శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా శనివారం ప్రమాణ స్వీకారం చేసిన రంగినేని చెంచయ్య నాయుడుకు ఎంజీఎం సంస్థల చైర్మన్ గుడ్లూరు మల్లికార్జున నాయుడు, డైరెక్టర్ మయూర్ ఘనంగా సత్కరించారు. శుభాకాంక్షలు తెలియజేశారు. రైతాంగం అభివ ద్ధికి పాటు పడాలని సూచించారు.

ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

తిరుపతి డివిజన్ అధ్యక్షులుగా అశోక్ రెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ తిరుపతి డివిజన్ యూనిట్ ఎన్నికలు నోటిఫికేషన్ ప్రకారం ప్రశాంత వాతావరణంలో శనివారం జరిగాయి. అభ్యర్థులకు ఎటువంటి పోటీ లేకపోవడంతో తిరుపతి డివిజన్ యూనిట్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఎన్నికైన సభ్యులు 2025 నుండి 2028 వరకు పదవుల్లో కొనసాగుతారన్నారు. డివిజన్ యూనిట్ అధ్యక్షులుగా పుత్తూరు డిప్యూటీ తహసిల్దార్ ఎం.అశోక్ రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ గా తిరుపతి డివిజనల్ పరిపాలన అధికారి పి.ఝాన్సీలక్ష్మి, ఉపాధ్యక్షులుగా పాకాల రిసర్వే డిప్యూటీ తహసీల్దార్ పి. కళ్యాణ్, వడమాలపేట డిప్యూటీ తహసిల్దార్ జీ. క ష?మ్మ, చిన్నగొట్టిగల్లు మండలం డిప్యూటీ తహసిల్దార్ భాస్కర్, కార్యదర్శిగా చంద్రగిరి డిప్యూటీ తహసిల్దార్ ఎస్. దివాకర్, జాయింట్ సెక్రటరీలుగా తిరుపతి పట్టణ డిప్యూటీ తహసిల్దార్ జి. రామచంద్రయ్య, చంద్రగిరి ఆఫీస్ సబార్డినేట్ పురుషోత్తం, తిరుపతి పట్టణ ఎలక్షన్ డిప్యూటీ తాసిల్దార్ సుధాకర్ నాయక్, కోశాధికారిగా తిరుపతి రూరల్ డిప్యూటీ తహసిల్దార్ ఎం. మోహన్ బాబు, కార్యవర్గ సభ్యులుగా లోకేశ్వర్, వంశీక ష?, పవన్ కుమార్, మంజునాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ తిరుపతి డివిజన్ యూనిట్ నూతన కార్యవర్గాన్ని తిరుపతి జిల్లా అధ్యక్షులు సిద్దాల శివప్రసాద్, కార్యదర్శి గోపీనాథ్, కోశాధికారి రూప్ చంద్, తిరుపతి అర్బన్ మండల తహసిల్దార్ సురేష్ బాబు, చిన్నగొట్టిగల్లు తహసీల్దార్ భాగ్యలక్ష్మి ప్రత్యేకంగా అభినందించారు. సంఘం బలోపేతం కోసం సమిష్టిగా క షి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. నూతన కమిటీకి పలువురు శుభాకాంక్షలు తెలిపి అభినందనలు చెప్పారు.

సంస్కృత విద్యాపీఠంలో కీచకపర్వం

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

అది దేశంలోనే పేరెన్నిక గన్న సంస్కృత విద్యాపీఠం. భారతీయ ప్రాచీన భాష సంస్కృతి పరిఢవిల్లేలా చేయటంలో కీలకం. సంస్కృత, సాంప్రదాయాలను ఆకళింప చేస్తూ భవిష్యత్తు తరాలకు విలువలతో కూడిన జీవితాన్ని అందించడం తన కర్తవ్యం. కానీ విద్యాబుద్ధులు నేర్పాల్సిన కొంతమంది నీచ గురువులు, ప్రసిద్ధిగాంచిన విద్యాపీఠంలో కీచక పర్వానికి తెరలేపారు. యూనివర్సిటీ ప్రతిష్టను రోడ్డున పడేశారు.

తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువైన ప్రాంతమే కాదు. విద్యా కేంద్రంగా కూడా వెలుగొందుతోంది. ప్రపంచంలో ఎక్కడ ఏ ప్రాంతానికీ లేనంత ఖ్యాతి ఈ ప్రాంతానికి దక్కింది. ఎనిమిది విశ్వవిద్యాలయాలకు నిలయమైన ప్రదేశం తిరుపతి. అందులో జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం (విద్యాపీఠం) ఒకటి. దశాబ్దాల క్రితం తిరుపతిలో నెలకొల్పారు. ఇక్కడికి దేశంలో నలుమూలల నుంచి అనేకమంది విద్యార్థులు సంస్కృత భాషలో పట్టాభద్రులు కావాలని, వచ్చి విద్యను అభ్యసిస్తుంటారు. విశాలమైన ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆధ్యాత్మిక శోభను తలపించేలా ఆ విశ్వవిద్యాలయ ప్రాంగణం ఉంటుంది. అలాంటి కేంద్రంలో గురువు అనే పదానికే మచ్చ తెచ్చేలా ఇద్దరు కీచక ఆచార్యులు వ్యవహరించిన తీరు సభ్య సమాజాన్ని గగుర్పాటుకు గురిచేసింది. ఒకసారి ఆ ఘటనను పరిశీలిస్తే...

ఒరిస్సా రాష్ట్రానికి చెందిన 22 సంవత్సరాల ఓ యవతి సంస్కృత భాషలో డిగ్రీ పొందేందుకు ఏడాది క్రితం తిరుపతిలో అడ్మిషన్ పొందింది. అందులో పని చేసే ఇద్దరు అధ్యాపకుల కన్ను ఆమెపై పడింది. ఇక అప్పటినుంచి ఆ యువతిని లోబరుచుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేశారు. బెదిరింపులకు దిగారు. ఓ రోజు అసిస్టెంట్ ప్రొఫెసర్గా పని చేస్తున్న లక్ష్మణ్ కుమార్ ఆ యువతని తన ఛాంబర్కు పిలిపించి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బెదిరించి, భయపెట్టి ఆ యువతిని బలాత్కరించాడు. ఆ ఘటనను మరో అధ్యాపకుడు శేఖర్ రెడ్డి తన సెల్ ఫోన్లో చిత్రీకరించాడు. తనకు లొంగకపోతే ఆ దశ్యాలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించి లోబరుచుకున్నాడు. ఇద్దరు అధ్యాపకులు తరచూ బెదిరించి బలత్కరించేవారు. యువతి గర్భవతి కావడంతో విషయాన్ని బయటకు పొక్కనీకుండా ఆ అధ్యాపకులు బెదిరించారు. ఎంతో ఆశతో సంస్కృత పట్టాను పొందేందుకు తిరుపతికి వచ్చిన ఆ యువతి, తనకు జరిగిన అవమానాన్ని భరించలేక, విద్యారంగంపైనే విరక్తితో చదువును అర్ధాంతరంగా మానేసి, సొంతూరైన ఒరిస్సా రాష్ట్రానికి వెళ్లిపోయింది. అక్కడ తోటి స్నేహితులు, కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియజేసి, వారి అండతో ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఐద్వా, విద్యార్థిసంఘాలు కీచక ఆచార్యులను అరెస్టు చేయాలని నినదించాయి. దీంతో సంస్కృత విద్యాలయ పెద్దలు ఈ ఘటనపై విచారణ కమిటీ వేసి చేతులు దులుపుకున్నారు. ఈ ఘటన విషయం తెలుసుకున్న స్థానిక పార్లమెంటు సభ్యుడు పార్లమెంటు సాక్షిగా యువతి ఘటనను లేవనెత్తడంతో దేశవ్యాప్తంగా బహిర్గతం అయ్యింది. అప్రమత్తమైన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ తిరుపతి వెస్ట్ పోలీసులకు ఆ అధ్యాపకుల పై ఫిర్యాదు చేశాడు. పోలీసులు సిఆర్ నెంబర్ 183/2025, యు /ఎస్ 75(1), 77, 79, 351(2) ఆర్ /డబ్ల్యూ 3(5) బిఎన్ఎస్ ప్రకారం కేసు నమోదు చేశారు. తిరుపతి డిఎస్పి కేసు విచారణ నిమిత్తం ఒరిస్సా రాష్ట్రానికి వెళ్లి, బాధితురాలు ఇంటి వద్ద ఆమెను విచారించారు. బాధితురాలు తెలియజేసిన సమాచారంతో పోలీసులే అవాక్కయ్యారు. తిరిగి తిరుపతికి వచ్చి ఆ కీచక అధ్యాపకులను అరెస్టు చేశారు. వారిపై అదనంగా సెక్షన్లో 63, 68 బి ఎన్ ఎస్ చేర్చి రిమాండ్ కు తరలించారు. జీవిత సత్యాన్ని తెలియజేసి విలువలు నేర్పించాల్సిన విశ్వవిద్యాలయాలోని అధ్యాపకులే ఇంతటి ఘాతుకానికి పాల్పడితే, యువతను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఎవరిది...? ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాలకులు నిరంతర పర్యవేక్షణ ఏర్పాటు చేసి, సంబంధిత బాధితురాలికి న్యాయం చేయాలని, ప్రజా సంఘాలు, విద్యార్థి, మహిళా సంఘాలు కోరుతున్నాయి.

పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

సోషియల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఎడిజిబిట్ వారి ఆర్థిక సహకారంతో తిరుపతి యూత్ హాస్టల్ నందు 40 మంది పేద విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని మాట్లాడుతూ సిర్డ్స్ సంస్థ దాతలు సహకారం తో 40 మంది విద్యార్థులకు సైకిల్ పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు. పిల్లలందరూ ప్రతిరోజు సూదుర ప్రాంతాల నుండి బడికినడిచి వస్తున్నందున సిర్డ్స్ సంస్థ వారు గుర్తించి సైకిళ్లు ఇచ్చారన్నారు.పూతలపట్టు శాసనసభ్యులు మురళి మాట్లాడుతూ విద్య విద్యార్థుల భవిష్యత్తు మారుస్తుందని, ప్రతి విద్యార్థి బాధ్యతగా చదువుకోవాలని,తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత స్థాయికి ఎదిగానని, ప్రతి ఒక్కరూ కూడా సహాయం చేసిన వారిని మర్చిపోకుండా తాను చదువుకున్న స్కూల్ కి గ్రామానికి మంచి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్ రావు , సిర్డ్స్ సంస్థ ప్రధాన కార్యదర్శి మరుపూరి హేమశేఖర్, ఎంఈఓ భాస్కర్, మాస్ సంస్థ అధ్యక్షులు జ్ఞాన శేఖర్ రెడ్డి, సిర్డ్స్ సంస్థ కో ఆర్డినేటర్స్ తేజోవతి, గీత, భాస్కరమ్మ, అశ్విని, శ్వేత,వనిత పాల్గొన్నారు.

వేదవ్యాస డిగ్రీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఎస్వి యూనివర్సిటీ విడుదల చేసిన నాలుగవ సెమిస్టర్ ఫలితాల్లో, పుత్తూరు వేద వ్యాస విద్యార్థులు 25 మంది 9.0 జిపిఏకి పైగా పాయింట్లు సాధించారని కరస్పాండెంట్ బాల సరస్వతి, డైరెక్టర్ నారాయణ బాబు, వేదవ్యాస తెలిపారు. బిఎస్సి (కెమిస్ట్రీ) జ్యోతిర్మయి (9.55), బికాం (సిఏ) తన్మయి (9.51), బిఎస్సీ (కంప్యూటర్ సైన్స్) గుణసుందరి (9.30) సాధించి, డివిజన్ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. బికాం, బిఎస్సీకి చెందిన 25 మంది విద్యార్థులు 9.0 గ్రేడ్ పాయింట్లకు పైగా సాధించారు. విద్యార్థులను అధ్యాపక బృందం అభినందించారు.

గీతాంజలి పాఠశాలకు ప్రతిభ అవార్డు

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు : స్థానిక భాకరాపేట గీతాంజలి స్కూలుకు అరుదైన గౌరవం దక్కింది. ఎస్డి ప్రోమో వారి ఆధ్వర్యంలో హైదరాబాద్ హైటెక్ సిటీ, సర్వేపల్లి రాధాకృష్ణ హాలులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బ్రెయిన్ ఫీడ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ సంస్థ ఈ అవార్డును గీతాంజలి స్కూల్ కరస్పాండెంట్ గిరి కుమార్ రెడ్డికి అందించారు. సమాజ అభివృద్ధికి అనునిత్యం కృషి చేస్తూ వేలాదిమంది విద్యార్థులను సమాజసేవకు అందించి, ఎంతోమంది తల్లిదండ్రుల జీవితాలలో వెలుగు నింపిన భాకరాపేట గీతాంజలి పాఠశాల కరస్పాండెంట్ కంభం గిరి కుమార్ రెడ్డి అని అవార్డుల ప్రధానోత్సవంలో పాల్గొన్న పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ గిరి కుమార్ రెడ్డి మాట్లాడుతూ గీతాంజలి స్కూలుకు ప్రతిభ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. తమ విద్యా సంస్థ దాదాపు 14 సంవత్సరాల నుండి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతూ, పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండలంలోనే మొదటి స్థానంలో నిలుస్తున్నట్లు తెలిపారు. ఎంతోమంది విద్యార్థులను సమాజానికి అందించిన అందించిందని, గత సంవత్సరం కూడా పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించామని తెలిపారు. 12 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారని, అందులో మండలంలోని మరే పాఠశాలకు సాటిలేని విధంగా ఎదిగిన తమ పాఠశాలకు రెండు ప్రతిభ అవార్డులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రదానం చేసిందన్నారు. తమ విద్యార్థులు జాతీయ అంతర్జాతీయ రంగాలలో ఉత్తమ సేవలు అందిస్తున్నారని, ఇది నిజంగానే ప్రతిభకు పట్టాభిషేకమని ఆనందాన్ని వ్యక్తం చేశారు. అలాగే తమ పాఠశాల రాబోయే రోజులలో కూడా సమాజానికి ఉత్తమ విద్యార్థులను అందిస్తుందని, దీనికోసం తమ పాఠశాల ఉపాధ్యాయులు అహర్నిశలు పాటు పడతారని తెలియజేశారు. ఈ అవార్డు పాఠశాలకు రావడానికి కృషిచేసిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: బాలల హక్కుల పరిరక్షణ బాధ్యత అందరిదీ అని ప్రజా కళావేదిక వ్యవస్థాపక ఛైర్మన్ అరవ జయపాల్ పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు బాలల హక్కులు, చట్టాల గురించి అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక ఎంసిహెచ్ యస్ మాడవీధిలో ప్రజా కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు హెడ్మాస్టర్ ఆనందకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జయపాల్ మాట్లాడుతూ ప్రతి యేటా నవంబరు 20న అంతర్జాతీయ బాలల హక్కుల పరిరక్షణ దినోత్సవం నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి హెచ్ఎం కె. సోమ శేఖర్ రెడ్డి, టీచర్లు వరలక్ష్మి (తెలుగు పండిట్), సునీత (సోషల్ స్టడీస్), పిడి సుధ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో బాంబ్ స్క్వాడ్ తనిఖీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం, అప్పలాయగుంట శ్రీ అభయ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం బాంబు స్క్వాడ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇటీవల తిరుపతిలో వచ్చిన బాంబు బెదిరింపులు నేపథ్యలో టీటీడీ అనుబంధ ఆలయమైన ఆలయాలలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ, విజిలెన్స్ అధికారుల ఆదేశాలతో తనిఖీలు నిర్వహించినట్లు స్క్వాడ్ సభ్యులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని పోలీసులు వెల్లడించారు.

ప్రజా వినతికి స్పందన.. డ్రైనేజీ పూడికతీత

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక కృష్ణా నగర్‌లో డ్రైనేజీ కాలవల్లో పూడికలు తీయాలని, ప్రజా ఫిర్యాదుల వేదికలో వచ్చిన వినతి మేరకు పురపాలక సంఘ కమిషనర్ డి.వి.నాగేశ్వర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి, శానిటరీ సిబ్బందితో డ్రైనేజీల్లో పూడిక తీయించి, పిచ్చిమొక్కలు తొలగింపచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికులు డ్రైనేజీ కాలువపై బండలు వేయడం వల్ల పూడిక తీయడం సిబ్బందికి కష్టతరమని తెలిపారు. కావును నివాసితులు సహరించి, మున్సిపాలిటీ సిబ్బందికి సహకరించాలని కోరారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఇంధనపు పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ శాఖ తిరుపతి సర్కిల్ ఆధ్వర్యంలో తొమ్మిదవ తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలను తిరుపతి సర్కిల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ క్విజ్ పోటీల్లో తిరుపతి రూరల్ డివిజన్ విద్యార్థులకు ప్రథమ స్థానం, గూడూరుకు ద్వితీయ స్థానం, నాయుడుపేట డివిజన్‌కు తృతీయ స్థానం దక్కింది. ఈ ఇందన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం సైకిల్ ర్యాలీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. సూపరింటెండింగ్ ఇంజనీరు చంద్రశేఖర రావు మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు, ఇతర డిపార్ట్మెంట్ ఉద్యోగులు కలిసి సైకిల్ ర్యాలీలో పాల్గొంటారని అందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు టెక్నికల్ వాసవి లత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు గంగాధర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కన్స్ట్రక్షన్ పి. బాలాజీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.ఆర్. టి. డివిజన్ రవికుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పుత్తూరు ఆశీర్వాదం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జయప్రకాష్, ఆంజనేయులు, ముని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాని ఆధ్వర్యంలో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించి, ఆయా మండలాలకు సంబంధించిన అధికారులకు అందజేసి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల కూటమి పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

న్యాయ శాస్త్రమే దిక్సూచి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఇటీవల ప్రాధాన్యత సంతరించుకుంటున్న కృత్రిమ మేధ (ఏఐ), సైబర్ క్రైమ్, డిజిటలైజేషన్ వంటి శాస్త్రాలకు న్యాయ శాస్త్రం దిక్సూచి వంటిదని, డాక్టర్ అంబెడ్కర్ గ్లోబల్ లా ఇన్స్టిట్యూట్‌లో శనివారం మొదలైన జాతీయ సదస్సులో సంబంధిత రంగ నిపుణులు స్పష్టం చేశారు. ఆవిష్కరణ, నైతికత, శ్రేష్ఠత లకు న్యాయశాస్త్రమే దిక్సూచి అనే అంశంపై లా ఇన్స్టిట్యూట్ ఆవరణలో రెండురోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. ఇన్స్టిట్యూట్ అధినేత డాక్టర్ ఆర్.తిప్పారెడ్డి నేతృత్వంలో జరిగిన సదస్సు ప్రారంభోత్సవంలో ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ అఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాంభట్ల వెంకట్రావు, రాష్ట్ర హై కోర్ట్ విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ వి ఆర్ కె కృపాసాగర్, దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ (వైజాగ్) వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశ రావు, శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ టాటా నరసింగరావు ప్రధాన వక్తలుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మానవునికి సమాజంతో ఉన్న సంబంధాలను నిర్దేశించడంలో న్యాయ శాస్త్ర ప్రాధాన్యత పెరిగిందన్నారు. కృత్రిమ మేధ విస్తృతమవుతున్న తరుణంలో న్యాయశాస్త్రానికి ప్రాధాన్యత పెరిగిందనే దశలో అధ్యయనం కొనసాగాలన్నారు. డాక్టర్ తిప్పారెడ్డి మాట్లాడుతూ సామాజిక న్యాయాన్ని అందించే లక్ష్యంతో న్యాయ విద్య అధ్యయనం సాగాలన్నదే తమ సంస్థ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బిజయ కుమార్ బెహ్రా, డాక్టర్ అశ్విని, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రవి నాయుడి కృషి అభినందనీయం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరునగరిలో క్రీడా నగరానికి (స్పోర్ట్స్ సిటీ) మొట్టమొదటిసారి భారీ స్థాయిలో భూమి కేటాయించడంతో క్రీడాకారులు, క్రీడా సంఘాలు, విద్యార్థిని విద్యార్థులు, స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. తిరుపతి, శ్రీనివాస క్రీడా సముదాయంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మానవవనరులశాఖ మంత్రి నారా లోకేష్ బాబు, రవాణా యువజన శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, చైర్మన్ అనిమిని రవి నాయుడు లకు శనివారం పాలాభిషేకం నిర్వహించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి శశిధర్ మాట్లాడుతూ తిరుపతి క్రీడా హబ్‌గా మారడానికి 28 ఎకరాల భూమిని కేటాయించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో డిఎస్‌డిఓ శశి కుమార్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పాకనాటి హరికృష్ణ, డాక్టర్ రమణ, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్, కోచ్‌లు ప్రేమ్ నాథ్, చక్రవర్తి, వినోద్, లక్ష్మి కరుణ, గోపి, సాయి, సుమతి, హిందూజా, క్రీడాకారులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి - నాయుడుపేట: ప్రజలు మానవత్వంతో రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని మేమున్నాం ఫౌండేషన్ నిర్వాహకులు పేర్కొన్నారు. సోమవారం నిర్వహించనున్న రక్తదాన శిబిరానికి సంబంధించిన కరపత్రాన్ని, సివి రామన్ డిగ్రీ కాలేజ్ కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ శనివారం ఆవిష్కరించారు. నిర్వాహకులు మాట్లాడుతూ అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని మేమున్నాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోవా బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో, అమరావతి గెస్ట్ ఇన్ సౌజన్యంలో నాయుడుపేట పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనం వద్ద సోమవారం మెగా రక్తదాన శిబిరం జరగనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివి రామన్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ జి.వి.వి.గోపాల్, సివి రామన్ డిగ్రీ కాలేజ్ ఏవో ముప్పాల వెంకటేశ్వర్లు, మేమున్నాం ఫౌండేషన్ సభ్యులు యాండ్రా అద్విక్ రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విశ్వం టాలెంట్ స్కూల్‌కు 'స్కూల్ ఎక్సలెన్స్ అవార్డ్'

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యారంగంలో నిరంతర నాణ్యత, నవీన బోధనా విధానాలు, ఆధునిక మౌలిక సదుపాయాలతో ముందుకు సాగుతున్న తిరుపతి విశ్వం టాలెంట్ స్కూల్‌కు 2025-26 విద్యా సంవత్సరానికిగాను నిర్వహించిన బ్రెయిన్‌ఫీడ్ స్కూల్ ఎక్సలెన్స్ అవార్డ్స్ కార్యక్రమంలో "బెస్ట్ అకడమిక్ ఎక్సలెన్స్ స్కూల్", "బెస్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్కూల్" విభాగంలో ఈ అవార్డును సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా విశ్వం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డిలు మాట్లాడుతూ విద్యార్థుల్లో బలమైన పునాదిని ఏర్పరచడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడమే తమ విద్యా తత్వమని స్పష్టం చేశారు. పరిసరాల పరిశుభ్రత, విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ ఘనత సాధించడంలో సహకరించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపక బృందం, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ ప్రాథమిక పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - పాకాల : పాకాల మండలం, అచ్చమ్మ అగ్రహారం, మోడల్ ప్రైమరీ పాఠశాల రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛ పాఠశాలగా ఎంపికయింది. దీన్ని పురస్కరించుకుని కడప రీజియన్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ శనివారం పాఠశాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛ విద్యాలయ యాప్‌లో అన్ని పాఠశాలలు మౌలిక సదుపాయాలను అప్లోడ్ చేయగా, అచ్చమ్మ అగ్రహారం తిరుపతి జిల్లాలో బెస్ట్ ప్రైమరీ పాఠశాలకు ఎంపిక అయిందని తెలిపారు. దీనికి కృషి చేసిన జిల్లా, మండల అధికారులకు, పాఠశాల ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఈ పాఠశాలలో మౌలిక వసతులున్నాయని, విద్యార్థుల హాజరు బాగుందని, ఉపాధ్యాయులు విలువలు బోధించడం వంటి అంశాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారులు బాబ్జి, లింగయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునీంద్ర బాబు, ఉపాధ్యాయులు నవీన్ కుమార్, జోహార్, రజనీ ప్రియ, విమల పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా దుస్తులు వితరణ

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: ఉపాధ్యాయ క్రికెట్ టీమ్‌కు సింగిల్ విండో చైర్మెన్ నందకిశోర్ రెడ్డి శనివారం క్రీడా దుస్తులు అందచేశారు. శ్రీకాళహస్తిలో జరిగనున్న డివిజన్ స్థాయి ఉపాధ్యాయుల క్రికెట్ పోటీల్లో వరదయ్యపాలెం మండలం జట్టు తరపున పాల్గొననున్న ఉపాధ్యాయుల విజయం సాధించి మండలానికి మంచి పేరు తేవాలని ఆయన కోరారు. కోరిన వెంటనే క్రీడా దుస్తులను అందించిన సింగిల్ విండో చైర్మెన్ నందకిశోర్ రెడ్డికి ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు, హెచ్‌యం రామణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - క్యాంపస్ : మెడికల్ కళాశాల పిపిపి విధానాన్ని రద్దు చేయాలని, రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాసర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, తిరుపతి, ఎంఆర్ పల్లి సర్కిల్ వద్ద ఏఐఎస్ఎఫ్ నగర సమితి ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలని కోరారు. 18న రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ విధానాన్ని వ్యతిరేకిస్తూ కళాశాలల ముందు నిర్వహించే ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉదయ్ కుమార్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి - క్యాంపస్, చంద్రగిరి : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని గృహవిజ్ఞాన శాస్త్ర విభాగానికి చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ 17, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శాంతిశ్రీ, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు చంద్రగిరి మండలంలోని, పాత శానంబట్లలో శనివారం ప్రత్యేక శిబిరంలో ఫ్యాబ్రిక్ పెయింటింగ్, బ్లాక్ ప్రింటింగ్, పాట్ పెయింటింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. గృహవిజ్ఞాన శాస్త్ర విభాగం, బి.వోక్ ఫ్యాషన్ టెక్నాలజీకి చెందిన అతిథి అధ్యాపకురాలు ఉమాదేవి గ్రామీణ మహిళలకు ఫ్యాబ్రిక్ పెయింటింగ్, పాట్ పెయింటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. నజీరా ఫ్యాషన్ అకాడమీ, తిరుపతి నుంచి హబీబుల్లా బ్లాక్ పెయింటింగ్ పై శిక్షణ అందించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శాంతిశ్రీ మాట్లాడుతూ మహిళలకుఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యశోద, పంచాయితీ కార్యదర్శి ఎస్.హరిత, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ల్యాబ్ పరికరాల మరమ్మతుపై శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు భౌతిక శాస్త్ర విభాగం, వెస్టర్న్ రీజనల్ ఇన్స్ట్రుమెంటేషన్ సెంటర్, న్యూఢిల్లీ సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని ఎస్వీయూలో నిర్వహిస్తున్నట్లు భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఆచార్య దేవప్రసాద్ రాజు తెలిపారు. శనివారం ఫిజిక్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల స్థాయిలో విద్యార్థులకు, పరిశోధకులకు, డిగ్రీ కళాశాల స్థాయిలో అధ్యాపకులకు పరిశోధనా ల్యాబ్‌లలో నిరుపయోగంగా మూలబడిన పరికరాలను రిపేరు చేసుకునే శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం సోమవారం సెనేట్ హాల్లో జరుగుతుందని, ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్ విజయభాస్కరరావు, ఎస్వీయూ రెక్టర్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, సైన్స్ కాలేజీ డీన్ ఆచార్య కేటి రామకృష్ణారెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు.

నవోదయ ప్రవేశ పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి -కోట : కోట మండలం, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన నవోదయ ప్రవేశ పరీక్షా కేంద్రాన్ని కోట తహశీల్దార్ కటారి జయ రావు శనివారం పరిశీలించారు. పరీక్షా కేంద్రంలోని వసతులు, విద్యార్థుల హాజరును అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. నవోదయ పరీక్షలకు 129 మంది నమోదు చేసుకోగా వారిలో 43 మంది విద్యార్థులే నవోదయ పరీక్షలకు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాజీమార్గమే రాజ మార్గమని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జ ఎస్‌సి రాఘవేంద్ర సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ దాలత్‌ను సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంతాలకు పోకుండా కేసులు పరిష్కరించుకోవాలని కక్షిదారులకు సూచించారు. ఈ సమావేశంలో పుత్తూరు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జ జానకి, అదనపు జూనియర్ రమ్య సాయి, పుత్తూరు న్యాయవాదులు సంఘం అధ్యక్షులు, గాలి సురేష్ బాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 642 కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్లో ఉన్న 642 కేసులు జూనియర్ సివిల్ కోర్ట్ న్యాయమూర్తి వెంకట నాగరాజు ఆధ్వర్యంలో పరిష్కారమయ్యాయి. వివిధ కేసులకు సంబంధించి 48 లక్షల 43 వేల404 రూపాయల నగదు రికవరీ చేశారు. 90 క్రిమినల్ కేసులు, 26 సివిల్ కేసులు, వివిధ బ్యాంకులో పెండింగ్ ఉన్న రుణాల కేసులు 21 పరిష్కారమాయ్యాయి. 505 ప్రెట్టి కేసులతో సహా, మొత్తం 642 కేసులు పరిష్కరించబడ్డాయి. ఈ కార్యక్రమంలో సత్యవేడు జూనియర్ సివిల్ జడ్జ కోర్ట్ ఏపీపీ లత, బార్ కౌన్సిల్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు మగ్గాలు పంపిణీ

ప్రజాశక్తి - పిచ్చాటూరు: నారాయణ వనం మండల కేంద్రం, ఎగువ పద్మశాలి వీధిలో చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో స్మాల్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం కింద చేనేత కార్మికులకు మొదటి విడత మంజూరైన మగ్గాలను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్ కుమార్, మాజీ నెడ్ క్యాబ్ చైర్మన్ ఆర్ డి ఏకాంబరం, మాజీ ఎంపీపీ పి గోవిందస్వామి, టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ అచ్చుకట్ల హరి, మాజీ వైస్ ఎంపీపీ సుబ్రహ్మణ్యం, కేజీ లక్ష్మణ్ నాయకులు మునెయ్య, బిఎం నరేష్ గోవింద శెట్టి, బాలమురుగన్, మాణిక్యంరెడ్డి, సుబ్రహ్మణ్యం శెట్టి చేనేత కార్మికులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన డిప్యూటీ డిఇఓ

ప్రజాశక్తి-ఏర్పేడు: బండారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డిఇఓ ఇందిరా దేవి శనివారం తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన వందరోజుల ప్రణాళిక అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పలు సూచనలు చేసి, పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజ వేలు, ఆంగ్ల ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి-ఏర్పేడు: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఈసీఎల్ కంపెనీ ప్రతినిధులు ప్రతిభ చూపిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్, ఏర్పేడు విద్యార్థినిలకు శనివారం నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఈ అకాడమిక్ ఎక్సెన్స్ అవార్డులను టి.భవ్యశ్రీ పదో తరగతిలో 564 మార్కులు సాధించినందుకు రూ.45 వేలు, ఎం.జోష్న, ఇంటర్మీడియట్ ఎంపీసీలో 972 మార్కులు సాధించినందుకు రూ. 40 వేల రూపాయలను ఈసీఎల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రామ్ కుమార్, హెచ్ఆర్ ఎక్స్యూటివ్ ప్రేమ్‌చంద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ధరణి, శోభ, బాబ్జి, జనార్ధన్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - సత్యవేడు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం రాష్ట్ర శాసన మండలి సభ్యులు (ఎమ్మెల్సీ) భూమిరెడ్డి రామగోపాల రెడ్డి శనివారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు స్వాగతం పలికి, శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకతలు, మౌలిక సదుపాయాలు, ఉద్యోగాల కల్పన గురించి వివరించారు. సంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ, స్థానికులకు, ముఖ్యంగా మహిళలకు ఉద్యోగాలు కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలను అభినందించారు. ఈ పర్యటనలో భాగంగా శ్రీసిటీ పరిసరాలను చుట్టిచూసి పారిశ్రామిక కార్యకలాపాలను ఎమ్మెల్సీ పరిశీలించారు.

గూడూరును జిల్లా కేంద్రం చేయాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, గాంధీ బొమ్మ సెంటర్ నుండి భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో గూడూరు జిల్లా కేంద్రం చేయాలనే నినాదంతో శనివారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగించారు. నిర్వాహకులు కంకణాల పెంచల నాయుడు మాట్లాడుతూ గూడూరును జిల్లా కేంద్రం చేయాలని, ప్రజల ఆకాంక్షను సీఎం నెరవేర్చి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలని ఆకాంక్షించారు.

సంస్కృత విశ్వవిద్యాలయంలో వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి వక్తృత్వం, శలక పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, అధ్యాపకులు, ప్రముఖులు, సంస్కృత పండితులు ఉత్సాహంగా ఈ ప్రారంభోత్సవ వేడుకకు హాజరయ్యారు. డాక్టర్ చెలికాని అన్నారావు నూతన అకడమిక్ బిల్డింగ్ సెమినార్ హాల్‌లో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. 13,14 తేదీలలో మొత్తం 36 శాస్త్రీయ విషయాలపైన పోటీలు నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుండి వివిధ సంస్కృత సంస్థలు, గురుకులాల నుండి విద్యార్థులు పాల్గొంటారు. ఉపకులపతి, ప్రొఫెసర్ జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి, ఎన్ఎస్‌యూ మాజీ డీన్, అకడమిక్ అఫైర్స్ ప్రొఫెసర్ కొంపెల్ల రామసూర్యనారాయణలు మాట్లాడుతూ రాష్ట్ర, దేశ స్థాయిలో విద్యార్థులు ప్రతిభ చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, ప్రొఫెసర్ సి.రంగనాథన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కమ్యూనిటీ ట్రిప్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తరగతి గదుల్లో పాఠ్య పుస్తకాల నుండి టీచర్ల ద్వారా నేర్చుకున్న విషయాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఎస్వీఆర్ ప్రీ ప్రైమరీ వింగ్ పిల్లలకు లోకల్ ట్రిప్ ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో బుచ్చినాయుడు కండ్రిగ పోస్ట్ ఆఫీస్, వెటర్నరీ హాస్పిటల్, పోలీస్ స్టేషన్, ప్రైమరీ హెల్త్ సెంటర్ మొదలగు ప్రాంతాలకు పిల్లల్ని తీసుకెళ్లి అక్కడున్న అధికారులతో మాట్లాడించారు. ఇలా తమ చుట్టూ ఉన్న డాక్టరు, సబ్ ఇన్స్పెక్టర్ వంటి కమ్యూనిటీ హెల్పర్స్‌ని కలవడం పిల్లలకు అవగాహన కల్పించినట్లవుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. పిల్లలకు ఖర్జూరంపండు, బెల్లం, బొరుగులు, శనగలు వంటి తినుబండారాలని ఎస్ఐ హరి ప్రసాద్ పంచిపెట్టారు.

18న కలెక్టర్ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : వైద్య కళాశాలల ప్రైవేటీకరణనున వ్యతిరేకిస్తూ 18వ తేదీన తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి హరినాద్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం ఎం.చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన తిరుపతి బైరాగి పట్టెడ, సిపిఐ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను ప్రైవేటీకరించి, పేద విద్యార్థులకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. జీవో నెంబర్ 590, 107, 108 లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యమయ్యేలా మోడీ పాలన సాగుతోందని విమర్శించారు. సిపిఐ శతవసంతాల ముగింపు సభ జనవరి 18న ఖమ్మంలో జరుగుతుందని ఈ సభకు పార్టీ శ్రేణులను తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

జారవిడుచుకున్న సొత్తు గంటలో రికవరీ

ల్యాప్‌టాప్, నగదును అప్పగిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్, పిచ్చాటూరు : బస్సులో జారవిడుచుకున్న ల్యాప్‌టాప్, 16గ్రాముల బంగారం, రూ 7వేలను రెండు గంటల్లో గుర్తించి, బాధితులకు నారాయణవనం ఎస్ఐ శ్రీనివాస్ అందించి, మన్నలు పొందారు. వడమాలపేటకు చెందిన లోకేష్ తిరుపతి నుండి సత్యవేడు పల్లెవెలుగు బస్సును ఎక్కాడు. ప్రయాణికులు పరిమితికి మించి ఉండటంతో ల్యాప్‌టాప్ బ్యాగ్‌ను బస్సులో లగేజీ ర్యాక్‌లో పెట్టాడు. వడమాలపేటలో దిగేప్పుడు తన లగేజీ మరచి దిగేశాడు. బస్సు వెళ్లిన కొద్దిసేపటికి తను బ్యాగును మరచినట్లు గుర్తించి, వడమాలపేట పోలీసులను ఆశ్రయించారు. స్పందించిన నారాయణవనం ఎస్ఐ పాలమంగళం వద్ద బస్సును ఆపించి, తనిఖీ నిర్వహించి, బ్యాగ్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బాధితుడు లోకేష్‌కు ల్యాప్‌టాప్, బంగారం, నగదును గంటల వ్యవదిలోనే ట్రేస్ చేసి అప్పగించిన ఎస్ఐని పలువురు అభినందించారు.

ఎర్రచందనం స్వాధీనం

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: వాహనంతో సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, తమిళనాడుకు చెందిన ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు చామల రేంజ్ ఫారెస్ట్ అధికారి వెంకటరమణ భాకరాపేట శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు పించా అటవీ ప్రాంతం నుండి యర్రావారిపాలెం-భాకరాపేట మీదుగా తమిళనాడుకు అక్రమ రవాణా జరుగుతున్నట్లు తమకు రహస్య సమాచారం అందిందన్నారు. సిబ్బందిని అప్రమత్తం చేసి దేవరకొండ బీట్ పరిధిలోని భాకరాపేట, తలకోన రోడ్డు వద్ద ఉన్న చర్చి దగ్గర కాపు కాశామని తెలిపారు. శనివారం తెల్లవారుజామున ఒంటిగంట ప్రాంతంలో ఒక అనుమానిత కారు రావడం గమనించి, ఆపడానికి ప్రయత్నించగా చర్చి సమీపంలో వాహనాన్ని వదిలి స్మగ్లర్లు పారిపోవడానికి ప్రయత్నించారన్నారు. పారిపోతున్న స్మగ్లర్లలో ఇద్దరిని పట్టుకోవడం జరిగిందని తెలిపారు. డ్రైవర్‌తో సహా ఎనిమిది మంది చీకటిలో పారిపోయారన్నారు. వాహనం పరిశీలించగా 546 కేజీల బరువు గల 18 ఎర్రచందనం దుంగలు ఉన్నాయని తెలిపారు. వాహనంతో సహా వీటి విలువ రూ.35 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. పారిపోయిన స్మగ్లర్ల కోసం గాలింపు చేపట్టామన్నారు. ఈ దాడిలో ఎఫ్‌బిఓలు రాజేష్ కుమార్, ప్రదీప్ చాంద్, సదాశివయ్య, జెబి.నిఖిల్, డ్రైవర్ శంకర్, ప్రభు తేజ, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారని తెలిపారు.

వంటగ్యాస్ లీకై.. పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల పరిధిలోని, చిన్నయ్య గుంట గ్రామంలో వంట గ్యాస్ లీకై పూరిల్లు దగ్ధమైన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే అంకమ్మ, తిరుపాలయ్య దంపతులు చిన్నయ్యగుంట గ్రామంలో నివసిస్తున్నారు. అంకమ్మ వంట పనిలో ఉండగా, పొదుపు సంఘాల వారు పిలవడంతో గ్యాస్ స్టౌవ్‌ను సిమ్‌లో పెట్టి పొదుపు సంఘం సమావేశానికి వెళ్లింది. తిరగి వచ్చి చూడగా ఇల్లంతా లీకైన గ్యాస్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగి పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలోఎవరికీ ప్రాణ నష్టం కానీ, గాయాలు కానీ జరగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కానీ ఇల్లు కాలిపోవండంతో, ఇంటిలోని వస్తువులు కూడా దగ్ధమయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డిఎస్పి

ప్రజాశక్తి - వాకాడు : వాకాడు సబ్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని శనివారం డిఎస్పీ గీతా కుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సబ్ ఇన్స్పెక్టర్ నిఖిల్ బాబుకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పోలీస్ స్టేషన్లోని ఫైల్స్, రికార్డ్స్, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు.

బూత్ లెవల్ సమస్యలపై దృష్టి

ప్రజాశక్తి - వాకాడు : వాకాడు హరిజనవాడలో శనివారం ఏపీ స్టేట్ ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ పురిమెట్ల కుమారి పర్యటించారు. ఆమె మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు బూత్ లెవల్ సమస్యలను పార్టీ దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు తెలిపారు. హరిజనవాడలో సమస్యలపై ప్రజలను అడగగా ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి పెట్టాలని వారు తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ లోన్ల ద్వారా వెనుకబడిన కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని, అర్హుల జాబితా తయారు చేయమని పార్టీ కార్యకర్తలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి వాకాడు మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్ రెడ్డి, టిడిపి నాయకులు కాటంరెడ్డి రామలింగారెడ్డి, రహంతుల్లా, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండల పరిధిలోని, వేణుగోపాలపురం పంచాయతీ, కమ్మవారిపాలెం గ్రామంలో శ్మశానానికి వెళ్లే దారి వర్షాకాలంలో కోతకు గురవడంతో గ్రామస్థులకు రాకపోకలు ఇబ్బందిగా మారాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు సర్పంచ్, రహిలమ్మ, సెక్రటరీ మహమ్మద్ తారీక్, ఆధ్వర్యంలో పంచాయతీ నిధులను వినియోగించి అండర్ ప్లైడ్జెన్ ఏర్పాటు పనులు చేపట్టారు. రహదారి కిందుగా నీరు పారే విధంగా పైప్ లైన్ అమర్చడంతో, రహదారి భద్రతతో పాటు గ్రామస్థుల సౌకర్యం మెరుగుపడే అవకాశం ఉంది. గ్రామాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తక్షణ స్పందనతో పనులు ప్రారంభించిన సర్పంచ్‌ని గ్రామస్తులు అభినందించారు.

IN THE COURT OF THE HON'BLE
III ADDITIONAL DISTRICT JUDGE :: TIRUPATI
O. S. No. 46 / 2020

D. Karthik Raghavendra s/o Late D. V. Rajagopal, Hindu, aged about 15 years, Minor, Rep. by his Mother/Natural Guardian, Smt. Y. Asha Latha ...Plaintiff

Vs

Dommaraju Kesavaraju and others ...Defendants

Summons to the Defendant No. 3

D. Hema Sai s/o Late D. V. Rajagopal, Minor Rep. by his mother/Natural Guardian Smt. V. Jagadeeswari w/o late D. V. Rajagopal, residing at Door No. 5-9/A, Raja Reddy Layout, Gandhipuram, Pudipatla Post, Tirupati Rural Mandal, Tirupati, Tirupati District.

Please take summon that the above named plaintiff filed the above suit against you and some others for the relief as prayed in the plaint and the same is posted to **19-12-2025** at 10-30 a.m., for your appearance either in person or through an Advocate, if you fails to appear before the aforesaid Hon'ble court, the matter will be decided as per the material available on record and further proceed against you in your absence according to law.

(By order of the Hon'ble court)

Y.K.V. ARJUNA REDDY
N. RAVINDRA
Advocates for the Plaintiff, Tirupati, Tirupati District, A. P. Cell: 96663 23451

IN THE COURT OF THE HON'BLE
III ADDITIONAL DISTRICT JUDGE :: TIRUPATI
I.A.No. 539/2020, O.S.No. 46/2020

D. Karthik Raghavendra s/o Late D. V. Rajagopal, Hindu, aged about 15 years, Minor, Rep. by his Mother/Natural Guardian, Smt. Y. Asha Latha ...Petitioner/Plaintiff

Vs

Dommaraju Kesavaraju and others ...Respondents/Defendants

Notice to the Respondent No. 3

D. Hema Sai s/o Late D. V. Rajagopal, Minor Rep. by his mother/Natural Guardian Smt. V. Jagadeeswari w/o late D. V. Rajagopal, residing at Door No. 5-9/A, Raja Reddy Layout, Gandhipuram, Pudipatla Post, Tirupati Rural Mandal, Tirupati, Tirupati District.

Please take notice that the above named petitioner filed the above I. A. against you and some others for the relief as prayed in the petition and the same is posted to **19-12-2025** at 10-30 a.m., for your appearance either in person or through an Advocate, if you fails to appear before the aforesaid Hon'ble court, the matter will be decided as per the material available on record and further proceed against you in your absence according to law.

(By order of the Hon'ble court)

Y.K.V. ARJUNA REDDY
N. RAVINDRA
Advocates for the Petitioner, Tirupati, Tirupati District, A. P. Cell: 96663 23451